సాక్షి రంగారెడ్డి

సోమవారం, 4, నవంబర్, 2024



కూలీలు రాక..

కొండంత ఆశతో పంటలు సాగు చేస్తున్న రైతులకు కూలీల కొరతతో నిత్యం తిప్పలు తప్పడం లేదు. 8లో▸



పర్యావరణాన్ని పరిరక్షించాలి

ప్లాస్టిక్‌ని విడిచిపెట్టినప్పుడే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని జెండర్ టాస్ కమిటీ సభ్యురాలు నాగమణి పేర్కొన్నారు. 8లో▸



అనాథలకు అండగా..

అనాథల ఇబ్బందులు తెలుసుకున్న మిత్ర బృందం వారికి అండగా నిలిచింది. నగదు, నిత్యావసరాలు పంపిణీ చేసింది. 8లో▸

న్యూస్‌రీల్

కార్మికుల సంక్షేమానికి నిరంతర పోరాటం



మాట్లాడుతున్న పానుగంటి పర్వతాలు

షాద్‌నగర్: కార్మికుల సంక్షేమానికి నిరంతరం పోరాటం చేస్తామని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు అన్నారు. ఏఐటీయూసీ 105వ ఆవిర్భావ వేడుకలను ఆదివారం షాద్‌నగర్ పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆస్పత్రి వద్ద సంఘం జెండాను ఆవిష్కరించారు. అనంతరం పానుగంటి పర్వతాలు మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా పలు రంగాల కార్మికులు, కర్షకులకు ఏఐటీయూసీ అండగా నిలిచిందని అన్నారు. వారి హక్కుల కోసం ఉద్యమాలు చేసి ఎన్నో విజయాలు సాధించినట్లు గుర్తు చేశారు. హక్కుల సాధన కోసం కార్మికులంతా ఐక్యంగా పోరాటం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు చంద్రబాబు, గడ్డం జంగయ్య, పవన్ చౌహాన్, శివ, ఆకాష్, సాయి, ఖదీర్, మల్లేష్, నయూం, వేమారెడ్డి, అనిత, శారద, పద్మమ్మ, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

ధర్మయుద్ధ సదస్సును జయప్రదం చేయండి



సమావేశంలో పాల్గొన్న ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు నర్సింహ మాదిగ తదితరులు

షాద్‌నగర్‌రూరల్: ఎస్సీ వర్గీకరణ అమలు కోసం ఈనెల 6న తుక్కుగూడలో నిర్వహించనున్న మాదిగల ధర్మ యుద్ధ సదస్సును విజయవంతం చేయాలని ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు పెంటనోళ్ల నర్సింహ మాదిగ పిలుపునిచ్చారు. పట్టణంలోని సంఘం కార్యాలయం వద్ద ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం ఎస్సీ వర్గీకరణ అమల్లోకి వచ్చిన తర్వాతే ఉద్యోగాలు భర్తీ చేయాలని అన్నారు. వర్గీకరణ అమలు చేయకుండా 11వేల టీచర్ పోస్టులు భర్తీ చేసి మాదిగలకు ద్రోహం చేశారని మండిపడ్డారు. మాలల ఒత్తిడికి తలొగ్గి వారికి ఉద్యోగాలను దోచిపెడుతున్నారని ఆరోపించారు. తక్షణమే ఉద్యోగాల భర్తీని నిలిపి వేయాలని డిమాండ్ చేశారు. తుక్కుగూడలో నిర్వహించే సదస్సుకు మంద కృష్ణ మాదిగ ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు తెలిపారు. మాదిగలు, మాదిగ ఉపకులాల వారు, విద్యావంతులు, మేధావులు ప్రజాస్వామిక వాదులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు శ్రావణ్‌కుమార్, ఆనంద్, బాల్‌రాజ్, జాంగారి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడాకారులకు పూర్తి సహకారం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న కాంత్రికుమార్, ఎల్లన్ గుత్తా

మొయినాబాద్: గ్రామీణ ప్రాంతంలోని క్రీడాకారులను ప్రోత్సహించేందుకు పూర్తి సహకారం అందిస్తామని ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి జ్వాలగుత్తా తండ్రి క్రాంతికుమార్ అన్నారు. మండల పరిధిలోని నాగిరెడ్డిగూడ రెవెన్యూలో ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి జ్వాలగుత్తా అకాడమీ స్థాపించి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా మెగా టోర్నీ నిర్వహించారు. ఇందులో విజేతలుగా నిలిచిన మొయినాబాద్ మండలం పెద్దమంగళారానికి చెందిన చేగూరి మహరాజ్‌గౌడ్, పడమటి జనార్దన్‌రెడ్డికి ఆదివారం క్రాంతికుమార్ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడాకారులను మరింత నైపుణ్యం అందించేందుకే జ్వాల గుత్తా అకాడమీని స్థాపించినట్లు తెలిపారు. అకాడమీలో నిష్ణాతులైన కోచ్‌లు అందుబాటులో ఉన్నారని.. క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నైపుణ్యం ఉండి క్రీడలకు దూరమైన వారు తమను సంప్రదిస్తే వారికి కావాల్సిన సౌకర్యాలు పూర్తిస్థాయిలో సమకూరుస్తామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలను ప్రోత్సహించేందుకు అకాడమీలో ప్రత్యేక చర్యలు చేపట్టినట్టు చెప్పారు. కార్యక్రమంలో జ్వాల గుత్తా తల్లి ఎల్లన్ గుత్తా, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



సంధ్యా సమయం.. సాగర తీరం



చలికాలంలో ఉదయం 5 గంటల వేళ పొగమంచు కురవడం సాధారణమే. కానీ.. సాయంత్రం 5 గంటలప్పుడు పొగమంచుతో హుస్సేన్ సాగర్ పరిసరాలన్నీ మసకమసక చీకట్లను తలపించడంతో సందర్శకులు ఒకింత ఆశ్చర్యచకితులయ్యారు. ఆదివారం 4 గంటల వరకు ఎండకొట్టింది. సూరీడు తన ప్రతాపం చూపించడంతో నగరవాసులు ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరయ్యారు. ఆ తర్వాత వాతావరణంలో మార్పు వచ్చింది. మెల్లమెల్లగా పొగమంచు రావడం మొదలైంది. 5 గంటల సమయంలో నగరంలోని పలు ప్రాంతాలు మసకమసకగా మారాయి. హుస్సేన్ సాగర్‌ను పొగమంచు కప్పివేయడంతో తథాగతుడి విగ్రహం, తీరంలోని సచివాలయ భవనం, అంబేద్కర్ స్టాచ్యూ.. ఇలా కనిపించాయి.

ఫ్యూచర్.. నజర్

ఫ్యూచర్‌సిటీపై భరోసా

- సమీపంలోని గ్రామాలపై దృష్టి
- వ్యవసాయ భూముల కొనుగోలుకు ఆసక్తి
- ఆరా తీస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు
- భవిష్యత్తులో ధరలు పెరుగుతాయనే ఆశ



నందివనపర్తిలోని వ్యవసాయ భూమి

యాచారం: ఫ్యూచర్‌సిటీ చుట్టూ ఉన్న గ్రామాల్లోని వ్యవసాయ భూములపై పలువురు ప్రజాప్రతినిధులు, ఐఏఎస్, ఐపీఎస్, ఇతర ఉన్నతాధికారులు దృష్టి సారించారు. తమ సన్నిహితుల ద్వారా ఆయా గ్రామాల్లోని వ్యవసాయ పట్టా భూముల ధరలపై ఆరా తీస్తున్నట్లు సమాచారం. వ్యవసాయానికి అనుకూలంగా, భూగర్భజలాలు పుష్కలంగా, ఎర్రటి నేలలున్న భూములను కొనుగోలు చేసి పెట్టాలని కోరుతున్నారు. రేవంత్‌రెడ్డి సర్కార్ యాచారం-కందుకూరు మండలాల సరిహద్దులో ఫ్యూచర్‌సిటీని నెలకొల్పడానికి సంకల్పించడం తెలిసిందే. కొంగరకలాన్ ఓఆర్ఆర్ నుంచి నిర్మించబోయే ఫ్యూచర్‌సిటీకి 300 అడుగుల రోడ్డు, మెట్రో రైలు మార్గానికి పచ్చజెండా ఊపింది. దీంతో భవిష్యత్తులో ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందుతుందనే భావనతో వ్యవసాయ భూములు కొనుగోలు చేసి పెట్టుకోవాలని చూస్తున్నారు. కొద్ది రోజులుగా ఆయా గ్రామాల్లో తమ సన్నిహితులతో కలిసి వ్యవసాయ భూములను పరిశీలిస్తున్నారు.

ఆ గ్రామాలపై ఫోకస్..

కందుకూరు మండల పరిధిలోని మీరాఖాన్‌పేట, ఆకులామైలారం, బెగరికంచె, ముచ్చర్ల, సాయిరెడ్డిగూడ, దాసర్లపల్లి, లేమూర్, గూడూర్, యాచారం మండల పరిధిలోని నస్దిక్‌సింగారం, నందివనపర్తి, యాచారం, చౌదర్‌పల్లి, చింతుల్ల, కుర్మిద్ద, నానక్‌నగర్, తాడిపర్తి, నక్కర్తమేడిపల్లి గ్రామాల్లోని వ్యవసాయ భూములపై ప్రధానంగా దృష్టి సారించారు. ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని ఆదిబట్ల, కొంగరకలాన్, మహేశ్వరం మండల పరిధిలోని రావిరాల, తుక్కగూడ తదితర గ్రామాల్లో వ్యవసాయ భూములకు ఎకరాకు రూ.5 కోట్ల నుంచి రూ.10 కోట్లకు పైగా డిమాండ్ పెరిగింది. ఈ నేపథ్యంలో ఫ్యూచర్‌సిటీకి సమీపంలోని యాచారం, కందుకూరు గ్రామాల పరిధిలోని గ్రామాల్లో ప్రస్తుతం రూ.50 లక్షల నుంచి రూ. 3 కోట్ల వరకు ధర పలుకుతోంది.

ఫాంహౌస్‌లపై ఆసక్తి

యాచారం, కందుకూరు మండలాల పరిధిలోని గ్రామాల్లో సారవంతమైన వ్యవసాయ భూములున్నాయి. భూగర్భ జలాలకు ఢోకా లేదు. అందుకే ఆయా గ్రామాల్లోని వ్యవసాయ భూములను కొనుగోలు చేసి ఫాంహౌస్‌లు నిర్మించుకుంటే భవిష్యత్తులో మంచి డిమాండ్ ఉంటుందనే నమ్మకం కొనుగోలుదారుల్లో ఉంది. అత్యధికంగా 5 నుంచి 10 ఎకరాల్లోపే కొనుగోలు చేసేలా దృష్టి సారించారు.

కొనేందుకు పలువురి ఆసక్తి



ఫ్యూచర్‌సిటీపై భరోసాతో సమీపంలోని గ్రామాల్లో వ్యవసాయ భూముల కొనుగోలుకు కొంతమంది పెద్దలు ఆసక్తి చూపిస్తున్నారు. కొందరైతే నేరుగా రైతులతోనే మాట్లాడుకుని వ్యవసాయ భూములను కొనుగోలు చేస్తున్నారు.

– ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, రియల్ వ్యాపారి, హైదరాబాద్

ఎయిర్‌టెక్.. అవినీతి హైటెక్!

- ప్రైవేటు సేవలతో సీవరేజీ వర్క్ ఇన్‌స్పెక్టర్ల అక్రమాలు
- ప్రతి క్లీనింగ్‌కు రూ.1000 నుంచి రూ.3000 వసూలు
- జీపీఎస్ ట్రాకింగ్ లేకనే ప్రైవేటు కాల్స్‌కు అటెండ్
- ప్రేక్షక పాత్ర పోషిస్తున్న జలమండలి యంత్రాంగం



సాక్షి, సిటీబ్యూరో: జలమండలి సీవరేజీ పనుల కోసం జెట్టింగ్ ఎయిర్‌టెక్ యంత్రాలకు ఏటా కోట్లాది రూపాయలు అద్దె చెల్లిస్తుండగా.. క్షేత్ర స్థాయి పర్యవేక్షకులు మాత్రం అధికార దుర్వినియోగంతో వాటిని ప్రైవేట్ సేవలో కూడా వినియోగిస్తూ జేబులు నింపుకొంటున్నారు. సెక్షన్ మేనేజర్ల అండదండలతో కస్టమర్ సెంటర్‌కు వచ్చే 'కాల్స్'ను సైతం పక్కకు పెట్టి నేరుగా వచ్చే ప్రైవేటు కాల్స్‌ను అటెండ్ చేసేందుకు ఆసక్తి కనబర్చుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రతి ప్రైవేటు డొమెస్టిక్, కమర్షియల్ కాల్స్ అటెండ్‌కు కనీసం రూ.1000 నుంచి రూ.3000 వరకు వసూలు చేయడం బహిరంగ రహస్యమే. ఎయిర్‌టెక్ యంత్రాలకు జీపీఎస్ ట్రాకింగ్ లేకపోవడంతోనే అక్రమాలు ఇష్టారాజ్యంగా నడుస్తున్నాయనే విమర్శలు లేకపోలేదు. క్షేత్ర స్థాయిలలో జరుగుతున్న అక్రమ తంతు ఉన్నతాధికారుల దృష్టికి వచ్చినా పట్టించుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

అద్దె యంత్రాలతోనే సీవరేజీ వర్క్

నగరంతో పాటు శివారు ప్రాంతాల్లో జలమండలి మురుగు నీటి నిర్వహణ పనులను అద్దె యంత్రాలతో నిర్వహిస్తోంది. 2016లో జరిగిన ప్రమాద ఘటనల నేపథ్యంలో అప్పటినుంచి పారిశుద్ధ్య కార్మికులు మ్యాన్‌హోళ్లలోకి దిగకుండా నిషేధించింది. మాన్యువల్ క్లీనింగ్ నుంచి యంత్రాలతో క్లీనింగ్‌కు మారింది. ప్రస్తుతం 74 భారీ జెట్టింగ్ మెషీన్లు, 138 మినీ ఎయిర్‌టెక్ మెషీన్లు ఉన్నాయి. కోర్‌సిటీ పరిధిలో భారీ జెట్టింగ్, మినీ ఎయిర్‌టెక్ మెషీన్లతో మురుగు నీటి నిర్వహణ చేపడుతుండగా.. శివార్లలో మాత్రం మినీ ఎయిర్ టెక్ మెషీన్లను వినియోగిస్తున్నారు. ప్రతీ యంత్రం మురుగు పైపులైన్లను శుభ్రం చేస్తే దాని ప్రకారం నిర్దిష్ట రుసుం లెక్క కట్టి సదరు యజమానికి చెల్లిస్తారు. నెలవారీ భారీ జెట్టింగ్ మెషీన్లకు అద్దె రూ.3 లక్షల వరకు, మినీ ఎయిర్‌టెక్ మెషీన్లకు రూ.2 లక్షల అద్దె చెల్లిస్తున్నట్లు సమాచారం. మొత్తమ్మీద ఎయిర్ టెక్‌మెషీన్ల కోసం జలమండలి నెల నెలా సగటున రూ.4 కోట్లకు పైగా వెచ్చిస్తోంది.

జీపీఎస్‌కు ఆలస్యమెందుకో..

జలమండలి మహానగర పరిధిలో డ్రైనేజీ పైపులైన్ల క్లీనింగ్ కోసం వినియోగిస్తున్న జెట్టింగ్, ఎయిర్ టెక్ యంత్రాలపై నిఘా పెట్టేందుకు గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్ (జీపీఎస్) ట్రాకింగ్ ప్రతిపాదనకు ముందుకు పడటం లేదు. ఎయిర్‌టెక్ యంత్రాల పనితీరుపై పూర్తి స్థాయిలో దృష్టి సారించేందుకు జీపీఎస్‌తో యంత్రాలను అనుసంధానించేందుకు ప్రతీసారి ప్రణాళిక సిద్ధం అవుతున్నా.. అది కాగితాలకే పరిమితమవుతోంది. వాస్తవంగా జీపీఎస్ ట్రాకింగ్‌తో ప్రతి యంత్రం ఎక్కడ ఉంది? ఎలా పని చేస్తోంది? గుర్తించి పనితీరుపై లెక్కలు తేల్చవచ్చు. ఒక యంత్రం ఎక్కడెక్కడ ఎన్ని కిలోమీటర్లు తిరిగింది. ఏయే ప్రాంతాలకు వెళ్లింది.. అనే విషయాలను జీపీఎస్ ఆధారంగా సులువుగా గుర్తించవచ్చు. ప్రతీ ఎయిర్‌టెక్ యంత్రానికి జీపీఎస్ పరికరాలను అమర్చి ఖైరతాబాద్ ప్రధాన కార్యాలయం నుంచి పర్యవేక్షించాలని భావిస్తున్న ఆచరణ అమలు మాత్రం సాధ్యపడటం లేదు.

తక్షణ స్పందనతో కాసుల గలగల

సీవరేజీ సమస్యకు సంబంధించిన ప్రైవేటు కాల్స్ కాసులు కురిపిస్తుండటంతో క్షేత్ర స్థాయిలో వాటిపై ఆసక్తి పెరిగినట్లు తెలుస్తోంది. నగర పరిధిలోని బహుళ అంతస్తు గృహ, వాణిజ్య సముదాయాలకు సీవరేజీ సమస్య అధికంగానే ఉంటోంది. వాస్తవంగా సముదాయాల్లో సిల్ట్ చాంబర్ నిర్మించుకొని ప్రధాన పైపులైన్‌కు అనుసంధానిస్తే పెద్దగా ఉత్పన్నం కాదు. సిల్ట్ చాంబర్లు లేని కారణంగా సీవరేజీపై జలమండలికి ఫిర్యాదులు వెల్లువెత్తుతుంటాయి. కస్టమర్ కేర్‌కు ఫిర్యాదు చేస్తే రెండు రోజులు గడిస్తే కానీ ఎయిర్‌టెక్ మెషీన్లు రావడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. దీంతో పెద్ద బహుళ అంతస్తుల గృహ, వాణిజ్య సముదాయాల వినియోగదారులు కాల్ సెంటర్‌తో నిమిత్తం లేకుండా నేరుగా స్థానిక సీవరేజీ పర్యవేక్షకులకు ఫోన్ చేసి తమ సమస్యను పరిష్కరించుకుంటున్నారు. అందుకు సమస్య తీవ్రతను బట్టి డబ్బులు అడగడం, వారు చెల్లించడం షరా మామూలైంది. దీంతో కాల్ సెంటర్‌కు వచ్చే ఫిర్యాదుల కంటే నేరుగా వచ్చే ఫిర్యాదులపై క్షేత్రస్థాయి సిబ్బంది ఆసక్తి కనబర్చడం సర్వసాధారణమైంది.

విద్యుత్‌ను ఆదా చేస్తే ఉత్పత్తి చేసినట్లే



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్ఈ మాధవరెడ్డి

హుడాకాంప్లెక్స్: విద్యుత్‌ను ఆదా చేస్తే ఉత్పత్తి చేసినట్లేనని సరూర్‌నగర్ సర్కిల్ ఎస్ఈ చంగారి మాధవరెడ్డి అన్నారు. విద్యుత్ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా ఆదివారం సరూర్‌నగర్ సర్కిల్ పరిధిలోని చంపాపేట, సరూర్‌నగర్, ఆటోనగర్ విద్యుత్ డివిజన్లలో వినియోగదారుల సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా వినియోగదారుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. శారదానగర్ కాలనీలో రెండు అంతర్గత పోల్స్ ఏర్పాటు చేయాలని, పెరిగిన చెట్ల కొమ్మలు కొట్టివేయాలని ఫిర్యాదు రావడంతో 24 గంటల్లో సమస్య పరిష్కరించాలని ఏఈ నాగరాజును ఆదేశించారు. విద్యుత్ చౌర్యం చట్టరీత్యా నేరమని, ప్రజలంతా సకాలంలో బిల్లులు చెల్లించి మెరుగైన సేవలు పొందాలని సూచించారు. సదస్సులో డీఈ రాజారాంరెడ్డి, ఎస్ఏఓ రమణారెడ్డి, ఏడీఈ విజయభాస్కర్, ఏఈలు శ్రీనివాసచారి, నాగరాజు, శంకర్, ఎండీ పాషాద్రి పాల్గొన్నారు.

ప్రపంచ చాంపియన్‌గా తిరిగి రావాలి

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో రెజ్లర్ ప్రకాశ్‌సింగ్, ఎమ్మెల్యే తదితరులు

మణికొండ: ప్రపంచ రెజ్లింగ్ చాంపియన్‌గా నిలిచి దేశానికి తిరిగి రావాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆకాంక్షించారు. నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని వట్టినాగులపల్లికి చెందిన ప్రకాశ్‌సింగ్ ఈ నెల 9వ తేదీన రష్యాలో జరిగే ప్రపంచ బెల్ట్ రెజ్లింగ్ పోటీల్లో పాల్గొనేందుకు వెళ్లనున్నాడు. ఈ సందర్భంగా ఆదివారం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ అధ్వర్యంలో ప్రకాశ్‌సింగ్.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిశారు. ప్రపంచ రెజ్లింగ్ చాంపియన్‌షిప్ పోటీలకు మన రాష్ట్రం నుంచి ఎంపిక కావటం ఎంతో ఆనందంగా ఉందని, విజయం సాధించి తిరిగి రావాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆకాంక్షించినట్టు ప్రకాశ్‌సింగ్ తెలిపారు. త్వరలోనే క్రీడాకారులకు అన్ని రకాల సౌకర్యాలను కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటానని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారని ప్రకాశ్‌సింగ్ తెలిపారు.

అగ్రవర్ణాల ఆధిపత్యాన్ని కూలదోస్తాం

ధర్మసమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు విశారదన్ మహరాజ్



మహాసభలో మాట్లాడుతున్న డాక్టర్ విశారదన్ మహరాజ్

ఇబ్రహీంపట్నం రూరల్: అగ్రవర్ణాల ఆధిపత్యాన్ని కూలదోస్తామని ధర్మసమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహరాజ్ పేర్కొన్నారు. కొంగరకలాన్‌లోని కల్వకోలు భూపాల్‌రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం పార్టీ మహాసమ్మేళనం (మొదటి ప్లీనరీ) నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన విశారదన్ మహరాజ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. త్వరలోనే 15 వేల కిలోమీటర్ల మహాపాదయాత్ర చేపట్టనున్నట్లు వెల్లడించారు. 2025 జనవరి 5న ఆదిలాబాద్ నుంచి మహా పాదయాత్ర ప్రారంభించి 2028 వరకు మూడున్నర సంవత్సరాలు కొనసాగిస్తానని తెలిపారు. గతంలో పదివేల కిలోమీటర్ల పాదయాత్ర చేపట్టినట్టు గుర్తు చేశారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో రెండున్నర లక్షలకు పైగా ఓటర్లుంటే 93 శాతం బీసీ, ఎస్సీ, ఎస్టీ, ముస్లింలు ఉన్నారని అన్నారు. మూడు శాతం లేని రెడ్డిలకి అన్ని పార్టీలు టికెట్లు కేటాయించడం విడ్డూరంగా ఉందన్నారు. ఇక్కడి ఎమ్మెల్యే ప్రభుత్వ, ప్రైవేటు భూములు వందలాది ఎకరాలు ఆక్రమించారని, వీటన్నింటినీ భవిష్యత్తులో కక్కిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ చీఫ్ జస్టిస్ ఈశ్వరయ్య, నాయకులు వెంకట్‌రెడ్డి, రాఘవేంద్ర ముదిరాజ్, రాసాల వినోద్ యాదవ్, దుర్గాప్రసాద్, అన్నెల లక్ష్మణ్, రెహమాన్, శ్రీకాంత్, హరప్ప శివన్, కార్తీక్, తులసిగారి రవీందర్, భిక్షపతి, రాకేష్, భవాని శేఖర్, గజ్జల భాస్కర్, భవాని కిషన్, నాగార్జున, శ్రావణ్, ప్రదీప్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి



ప్రొద్దటూరులో అవగాహన కల్పిస్తున్న జెండర్ టాస్ కమిటీ సభ్యులు

శంకర్‌పల్లి: ప్రజలందరూ ప్లాస్టిక్‌ని విడిచిపెట్టినప్పుడే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని జెండర్ టాస్ కమిటీ సభ్యులు నాగమణి, ఎంఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు భాను పేర్కొన్నారు. ఆదివారం శంకర్‌పల్లి మండలం ప్రొద్దటూరు గ్రామంలో ప్లాస్టిక్ నిర్మూలనపై విద్యార్థులతో కలిసి ర్యాలీ, అవగాహన కల్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్లాస్టిక్ వాడడం వల్ల మానవాళి మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని, అదే విధంగా పర్యావరణం సైతం విషతుల్యం అవుతుందన్నారు. పట్టణాలు, గ్రామాల్లోని ప్రజలు ప్లాస్టిక్‌కి బదులు ఇతర ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు లక్ష్మి, మల్లేశం, భాగ్యమ్మ, శిరీష, మానస, నందిని, రేఖ, చందన, కార్తీక్, సతీష్, జశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

'నరేష్ గోయల్' కేసు పేరుతో రూ.37 లక్షలు స్వాహా

- నగరానికి చెందిన మహిళ నుంచి కాజేసిన నేరగాళ్లు
- కేసు నమోదు చేసిన హైదరాబాద్ సైబర్ క్రైమ్ కాప్స్

సాక్షి, సిటీబ్యూరో: నగరానికి చెందిన ఓ రిటైర్డ్ మహిళను (74) మనీలాండరింగ్ కేసు పేరుతో బెదిరించిన సైబర్ నేరగాళ్లు ఆమె నుంచి రూ.37.9 లక్షలు స్వాహా చేశారు. బాధితురాలి ఫిర్యాదుతో ఆదివారం కేసు నమోదు చేసుకున్న సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ప్రభుత్వ ఉద్యోగం చేసి, పదవీ విరమణ పొందిన సదరు మహిళకు ముంబైలోని అంధేరీ పోలీసుల పేరుతో వాట్సాప్ కాల్ వచ్చింది. ఆమెపై తమ ఠాణాలో ఓ కేసు నమోదైందని అవతలి వ్యక్తులు చెప్పారు. 24 గంటల్లో ఆమె పేరుతో ఉన్న అన్ని ఫోన్ నెంబర్లను ట్రాయ్ బ్లాక్ చేస్తున్నట్లు బెదిరించారు. అక్రమ ప్రకటనలు ఇవ్వడం, వేధింపులకు పాల్పడటం ఆ కేసులోని ప్రధాన ఆరోపణలని చెప్పారు. వెరిఫికేషన్ కోసమంటూ ఆమె నుంచి ఆధార్ నెంబర్ తీసుకున్నారు. ఆపై మరోసారి కాల్ చేసిన సైబర్ నేరగాళ్లు జెట్ ఎయిర్‌వేస్ ఫౌండర్ నరేష్ గోయల్ స్కామ్ పేరు చెప్పి బెదిరించారు. బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుని మనీలాండరింగ్‌కు పాల్పడిన ఆరోపణలపై నరేష్ గత ఏడాది సెప్టెంబర్‌లో అరెస్టు అయ్యారు. ఆ కేసులో మీ ప్రమేయం ఉన్నట్లు తేలిందని బాధితురాలితో చెప్పిన సైబర్ నేరగాళ్లు రూ.538.62 కోట్లతో ముడిపడి ఉన్న ఆ మనీలాండరింగ్ స్కామ్ నుంచి కొంత సొమ్ము కమీషన్‌గా అందినట్లు తేలిందని చెప్పారు. నరేష్ ఇళ్లు, కార్యాలయాల్లో చేసిన దాడుల్లో బాధితురాలి పేరుతో ఉన్న ఆమె పేరుతో ఉన్న ఏటీఎం కార్డు దొరికిందని భయపెట్టారు. దీనిపై ఇప్పటికే సీబీఐ, ఆర్బీఐ దర్యాప్తు చేస్తున్నట్లు నకిలీ లేఖలు సృష్టించి వాట్సాప్ ద్వారా పంపారు. ఈ విషయాలు ఎవరికీ చెప్పొద్దంటూ తీవ్రంగా బెదిరించారు. వారి వల్లోపడిన బాధితురాలు తన డిపాజిట్లు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు డ్రా చేసి రూ.37.9 లక్షలు ఆర్టీజీఎస్ ద్వారా సైబర్ నేరగాళ్లు సూచించిన ఖాతాలకు పంపింది. ఎట్టకేలకు తాను మోసపోయానని గుర్తించి సైబర్ క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న అధికారులు దర్యాప్తు ప్రారంభించారు.



ఆస్పల్లిగూడలో కూలీలు దొరకక చేనుపైనే ఉన్న పత్తి

కూలీలు రాక.. తిప్పలు తప్పక

- ఇతర ప్రాంతాల నుంచి తీసుకొస్తున్న అన్నదాతలు
- పెరుగుతున్న అదనపు ఖర్చులు

షాబాద్: కొండంత ఆశతో పంటలు సాగు చేస్తున్న రైతులకు కూలీల కొరతతో నిత్యం తిప్పలు తప్పడం లేదు. దుక్కి దున్ని, విత్తనాలు నాటి, అవి పెద్దవై పంట దశకు చేరే వరకు చేసిన శ్రమ ఒక ఎత్తయితే.. పంట చేతికి రావడం మరో ఎత్తుగా మారింది. స్థానికంగా కూలీలు అందుబాటులో లేకపోవడంతో పంట కోత దశలో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

కర్నూలు నుంచి

జిల్లాలో 558 గ్రామ పంచాయతీలున్నాయి. అందులో సాగవుతున్న పంటలకు కూలీల కొరత గణనీయంగా ఉంది. షాబాద్ మండలంలో దాదాపు 32 వేలకు మంది రైతులు ఉండగా.. అధిక శాతం మంది పత్తి పంటను సాగు చేశారు. మండల వ్యాప్తంగా 35 వేల ఎకరాల సాగు భూమి ఉంటే సుమారు 18 వేల ఎకరాల్లో పత్తి సాగయిందని అధికారుల అంచనా. అయితే ఆ పొలాలన్నీ ఒకేసారి దిగుబడి రావడంతో పత్తి తీసేందుకు అవసరమైన కూలీలు స్థానికంగా దొరకడం లేదు. అంతే కాకుండా ఏటా గ్రామాల్లో కూలీల సంఖ్య భారీగా తగ్గుతోంది. కర్నూల్ జిల్లాకు చెందిన కూలీలను తీసుకొచ్చి నివాసం ఏర్పాటు చేసి స్థానిక రైతులు పత్తి తీయించుకుంటున్నారు. దీంతో కూలీ డబ్బులతో పాటు వసతులు కల్పించేందుకు అదనంగా ఖర్చు చేయాల్సి వస్తోంది.

అదనపు భారం

మండలంలోని చిన్న, సన్నకారు రైతులు వివిధ గ్రామాల నుంచి ప్రత్యేకంగా ఆటోల్లో రోజువారీగా కూలీలను తీసుకొచ్చి పత్తిని తీయిస్తున్నారు. అందుకు కూలీ డబ్బులతో పాటు ఆటో చార్జీలు అదనంగా భరించాల్సి వస్తుంది. దీంతో పెట్టుబడి, ఈ అదనపు ఖర్చులు పోను కనీసం తమ కష్టానికి కూలీ కూడా గిట్టుబాటు కావడం లేదని పలువురు అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కిలో పత్తితీతకు రూ.15

పత్తి బాగా దిగుబడి రావడం, అన్ని పొలాల్లో ఒకేసారి కాపు రావడంతో రైతులకు కూలీల అవసరం అధికం కావడంతో డిమాండ్ అమాంతం పెరిగింది. పత్తి తీయడానికి గతంలో కిలోకి రూ.12 ఇచ్చేవారు. కానీ ఈ ఏడాది కూలీల కొరత కారణంగా కేజీకి రూ.15 చెల్లించాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. పత్తి క్వింటాకు రూ.7వేలు చెల్లించే వ్యాపారులు దిగుబడి పెరగడంతో ప్రస్తుతం రూ.6వేల నుంచి 6,500 మాత్రమే చెల్లిస్తున్నారు.

ఆంధ్ర నుంచి తీసుకొచ్చాం



ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురవడంతో పత్తి దిగుబడి పెరిగినా ధర మాత్రం కరువైంది. పత్తి ఏరేందుకు స్థానికంగా కూలీల కొరత ఉండడంతో ఆంధ్రా నుంచి తీసుకొచ్చి వారికి నివాసం ఏర్పాటు చేశాం. ఇతర వసతులు కల్పించడం భారంగా మారింది.

– విజయభాస్కర్‌రెడ్డి, రైతు, మరియాపురం

కూలీలు దొరకడం లేదు



స్థానికంగా కూలీలు దొరకడం లేదు. దీంతో కూలీలు రేట్లు పెంచుతున్నారు. ఎవరు ఎక్కువ కూలి ఇస్తే వారి పొలంలో పనులు చేస్తున్నారు. దీంతో చిన్న, సన్నకారు రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. దీనికితోడు దళారులు పత్తి ధర తగ్గిస్తున్నారు.

– శ్రీరాంరెడ్డి, రైతు, తిర్మలాపూర్

వలలో చిక్కుకొని.. ఊపిరాడక

చేపల వేటకు వెళ్లి వ్యక్తి దుర్మరణం



జంగయ్య (ఫైల్)

నందిగామ: చేపల వేటకు వెళ్లిన ఓ వ్యక్తి వలకు చిక్కుకొని చెరువులోనే మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని జంగోనిగూడ శివారులోని అక్కమ్మ చెరువులో ఆదివారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. జంగోనిగూడ గ్రామానికి చెందిన జంగ జంగయ్య(42) శనివారం సాయంత్రం గ్రామ సమీపంలోని అక్కమ్మ చెరువులోకి చేపలు పట్టేందుకు వెళ్లాడు. రాత్రయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు జంగయ్య ఆచూకీ కోసం వెతికారు. అర్ధరాత్రి గట్టుపైన దుస్తులు, చెప్పులు కనిపించడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు చెరువు సమీపంలో వెతికారు. రాత్రి కావడంతో ఆచూకీ లభించలేదు. ఆదివారం ఉదయం వెళ్లి చూడగా చేపల కోసం వేసిన వలకు చిక్కుకొని ఊపిరాడక మృతి చెందాడు. మృతుడి భార్య బాలమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తెలిపారు.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య



శ్రీకాంత్ (ఫైల్)

కేశంపేట: ఇంట్లో ఉరి వేసుకొని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం సాయంత్రం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. ఫరూఖ్‌నగర్ మండలం మధురాపూర్ గ్రామానికి చెందిన శ్రీకాంత్(25)కి మహబూబ్‌నగర్ జిల్లా చిన్నరేవెల్లి గ్రామానికి చెందిన మాధవితో రెండేళ్ల క్రితం వివాహం జరిగింది. అయితే భార్యాభర్తలు కొంత కాలంగా కేశంపేటలో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. శ్రీకాంత్ డ్రైవర్‌గా, మాధవి కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఆదివారం ఉదయం భార్య కూలీ పనులకు వెళ్లిన తర్వాత శ్రీకాంత్ ఇంట్లో వంటగదిలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు స్థానికులు తెలిపారు. అయితే ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. ఈ మేరకు పోలీసులకు గ్రామస్తులు సమాచారం అందించారు.

కానిస్టేబుల్‌కు ప్రశంస



అవినాష్‌కు ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న సీపీ మహంతి

తలకొండపల్లి: ఉత్తమ కోర్టు కానిస్టేబుల్‌గా తలకొండపల్లి ఠాణాలో విధులు నిర్వహించే అవినాష్ ఎంపికయ్యాడు. ఈ మేరకు సీపీ అవినాష్ మహంతి చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందుకున్నాడు. 2024 సంవత్సరానికి ఉత్తమ కోర్టు కానిస్టేబుల్‌గా అవినాష్ ఎంపికైనట్లు ఎస్‌ఐ శ్రీకాంత్ ఆదివారం తెలిపారు. ఈ మేరకు సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి ద్వారా ప్రశంసాపత్రాన్ని అందుకున్నాడు.

అసైన్డ్ భూమి కొనుగోలుకు యత్నం

వ్యక్తిపై కేసు నమోదు

మీర్‌పేట: బాలాపూర్ తహసీల్దార్ ఫిర్యాదు మేరకు అసైన్డ్ భూమిని కొనుగోలు చేసేందుకు యత్నించిన వ్యక్తిపై మీర్‌పేట పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ నాగరాజు కథనం ప్రకారం.. నాదర్‌గుల్‌లోని సర్వే నంబర్ 92లోని అసైన్డ్ భూమిని నార్సింగ్‌కు చెందిన ప్రవీణ్‌రెడ్డి నిబంధనలకు విరుద్ధంగా కొనుగోలు చేయాలనుకోవడంతో పాటు లేఅవుట్ ఏర్పాటుకు పూనుకున్నారు. ఇందు కోసం కబ్జాలో ఉన్న కొందరు గ్రామస్తులతో అగ్రిమెంట్ సైతం చేసుకున్నాడని తహసీల్దార్ ఆరోపిస్తూ ప్రవీణ్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని గత నెల 31వ తేదీన మీర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సీఐ తెలిపారు. ఈ మేరకు ప్రవీణ్‌రెడ్డిపై కేసు నమోదు చేసి అగ్రిమెంట్ చేసుకున్న కాపీలను సమర్పించాలని ఆదేశించినట్లు, దీనిపై విచారణ చేపడుతున్నామని సీఐ పేర్కొన్నారు.

శబరిమలకు పాదయాత్ర



మణికొండ: మణికొండ మున్సిపాలిటీ కేంద్రానికి చెందిన మధుసూదన్‌రెడ్డి మొదటిసారి అయ్యప్పస్వామి మాలాధారణ చేశారు. ఆదివారం కాలినడకన శబరిమలకు బయలుదేరారు. ఈనెల ఆఖరు లోపు శబరిమలకు చేరుకుంటానని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా గురుస్వామి రాజేందర్‌గౌడ్‌తో పాటు సన్నిధానం స్వాములు వీడ్కోలు పలికారు. విజయవంతంగా శబరిమల పాదయాత్రను ముగించుకుని రావాలని వారు ఆకాంక్షించారు.

ఉపాధ్యాయులతో సర్వే చేయించొద్దు

ఎస్‌జీటీయూ రాష్ట్ర సహ ప్రధాన కార్యదర్శి అంజయ్య

తలకొండపల్లి: ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులను కులగణన సర్వే విధుల్లో నియమించడంతో విద్యార్థుల చదువు ఇబ్బందికరంగా మారుతుందని ఎస్‌జీటీయూ రాష్ట్ర సహ ప్రధాన కార్యదర్శి పండుగ అంజయ్య అన్నారు. మధ్యాహ్నం వరకే పాఠశాలలను నడిపి, ఆ తర్వాత విద్యార్థులను ఇంటికి పంపితే తల్లిదండ్రుల్లో ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం సన్నగిల్లుతుందని పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడతూ.. టీచర్లు సర్వేకు వెళితే విద్యార్థులకు పాఠాలు బోధించేది ఏవరని ఆయన ప్రశ్నించారు. ఉపాధ్యాయులు సర్వేలో పాల్గొంటే చదువు ఎలా కొనసాగుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.



అనాథలకు అండగా

- నగదు, నిత్యావసర సరుకులు అందజేసిన మిత్ర బృందం
- దాతృత్వం చాటుకున్న కుకునూర్‌పల్లి జెడ్పీహెచ్ఎస్ 1995-96 బ్యాచ్ విద్యార్థులు

అబ్దుల్లాపూర్‌మెట్: అనాథల ఇబ్బందులు తెలుసుకున్న ఓ మిత్రబృందం వారికి అండగా నిలిచింది. నగదు, నిత్యావసర సరుకులకు పంపిణీ చేసి దాతృత్వం చాటుకుంది. సిద్దిపేట జిల్లా కుకునూర్‌పల్లి జెడ్పీహెచ్ఎస్‌లో 1995–96లో పదోతరగతి చదవిన విద్యార్థులు సోషల్ మీడియాలో హయత్‌నగర్‌లోని సుధీర్ ఫౌండేషన్ విద్యార్థుల బాధలను తెలుసుకున్నారు. దీంతో వారు సాయం చేయాలని నిర్ణయించుకుని నగదుతో పాటుగా బియ్యం, పప్పులు, వంట నూనె అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్‌లోని 125 మంది విద్యార్థులతో మాట్లాడారు. క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలని సూచించారు.

నాలెడ్జ్ సిటీలో బైక్ రేస్.. 36 మందిపై కేసు నమోదు


గచ్చిబౌలి: కేకలు వేస్తూ వాహనదారులను భయపెడుతూ బైక్ రేసింగ్‌కు పాల్పడిన 35 మందిపై కేసు నమోదు చేసినట్లు రాయదుర్గం ఇన్‌స్పెక్టర్ సీహెచ్ వెంకన్న తెలిపారు. ప్రమాదకర స్థితిలో బైక్‌తో స్టంట్లు చేయడం, బిగ్గరగా అరవడంతో అటుగా వెళ్లే వాహనదారులు ఒక్కసారిగా ఆందోళనకు గురవుతున్నారు. నాలెడ్జిసిటీలో బైక్ రేస్ నిర్వహిస్తున్నారన్న సమాచారంతో శనివారం రాత్రి 11.30 గంటల సమయంలో రాయదుర్గం పోలీసులు ఘటనా స్థలానిక చేకున్నారు. నలువైపుల పోలీసులు మోహరించి బైక్ రేస్‌కు పాల్పడిన 21 మంది యువకులను అదుపులోకి తీసుకున్నారు. 21 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం రాత్రి బైక్ రేస్‌కు పాల్పడిన 15 మంది, బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. రేస్‌కు పాల్పడిన యువకులను రిమాండ్ చేస్తామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. స్వాధీనం చేసుకున్న బైక్‌లను ఆర్టీఏ అధికారులకు అప్పగిస్తామన్నారు. బైక్ రేస్ చేయకుండా వారి తల్లిదండ్రులు కట్టడి చేయాల్సిన అవసరం ఉదని ఆయన సూచించారు. రేసింగ్‌లకు ఎలాంటి అనుమతులు లేవని, అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బైకును ఢీకొట్టిన టిప్పర్: యువకుడి మృతి

మియాపూర్: ద్విచక్రవాహనాన్ని టిప్పర్ లారీ వెనుక నుండి ఢీ కొనడంతో ఓ యువకుడు మృతి చెందగా మరో యువకుడికి గాయాలైన సంఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ నర్సింహారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..గుంటూరు జిల్లా పత్తిపాడు మండలం మేడవారిపాలెం గ్రామానికి చెందిన సజ్జ గోపికృష్ణ (23) మాదాపూర్‌లోని అయ్యప్ప సొసైటీలో స్నేహితుడు కార్తీక్, మరికొంతమంది స్నేహితులతో కలిసి ఉంటున్నారు. బంజారాహిల్స్‌లోని అగస్త్యాస్ హెల్త్‌కేర్ కంపెనీలో మెడికల్ కోడింగ్ ఉద్యోగం చేస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం అర్ధరాత్రి గోపికృష్ణ స్నేహితుడు కార్తీక్‌తో కలిసి బైకుపై కూకట్‌పల్లికి బయలుదేరారు. కార్తీక్ ద్విచక్రవాహనం నడుపుతుండగా గోపికృష్ణ వెనుక కూర్చున్నాడు. మియాపూర్‌లోని మెట్రో పిల్లర్–633 వద్దకు రాగానే వెనుక నుండి వేగంగా వచ్చిన టిప్పర్ లారీ వీరి బైకును ఢీకొంది. దీంతో వెనుక కూర్చున్న గోపికృష్ణ తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. కార్తీక్‌కు స్వల్పగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని గోపికృష్ణ మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. కార్తీక్ మాదాపూర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. టిప్పర్ డ్రైవర్ హనుమంతుపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. టిప్పర్ లారీని స్వాధీనం చేసుకుని డ్రైవర్ హనుమంతును అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

స్టంట్లు చేస్తూ..బాణసంచా కాల్చుతూ హల్‌చల్

- సోషల్ మీడియాలో వీడియో వైరల్
- కేసు నమోదు చేసిన రాయదుర్గం పోలీసులు







గచ్చిబౌలి: బైక్‌పై స్టంట్లు చేస్తూ బాణ సంచా కాల్చుతూ ఐటీ కారిడార్‌లో ఓ యువకుడు హల్‌చల్ చేసిన వీడియో వైరల్‌గా మారింది. ప్రమాదకర రీతిలో స్టంట్లు చేయడమే కాకుండా బాణసంచా కాల్చడాన్ని సైబరాబాద్ పోలీసులు సీరియస్‌గా తీసుకున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో ఈ ఘటనపై రాయదుర్గం పోలీసులు కేసు నమోదు చేశారు. కేబుల్ బ్రిడ్జిపై నుంచి స్టంట్లు వేసుకుంటూ వచ్చిన యువకుడు ఐటీసీ కోహినూర్ వద్ద లెఫ్ట్‌కు తీసుకొని షాట్స్(బాణసంచా) పేల్చాడు. స్టంట్లు వేస్తూ షాట్స్ పేల్చడాన్ని వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. వాహనాల రద్దీ ఉండే ప్రాంతంలో బైక్‌పై స్టంట్లు వేయడం, బాణసంచా కాల్చడం అత్యంత ప్రమాదకరం. ఈ క్రమంలో రాయదుర్గం పోలీసులు చట్ట ప్రకారం చర్యలు తీసుకునేందుకు సిద్ధమయ్యారు. ఘట్‌కేసర్ ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి ఇన్‌స్టాగామ్‌లో పోస్టు చేసినట్లు పోలీసులు గుర్తించారు. కేబుల్ బ్రిడ్జి పైనా స్టంట్లు చేసే వీడియోలను సేకరించినట్లు తెలుస్తోంది. బైక్‌పై నెంబర్ లేకపోవడంతో సదరు యువకుడి ఆచూకీ తెలియలేదని రాయదుర్గం ఇన్‌స్పెక్టర్ సీహెచ్ వెంకన్న తెలిపారు. స్టంట్లు చేసి, బాణసంచా కాల్చిన యువకుడిపై బీఎన్ఎస్ఎస్ 121 సెక్షన్ కింద ఆదివారం కేసు నమోదు చేశామన్నారు.